ప్రజాశక్తి
గురువారం 18 జులై 2024
5
కర్నూలు





మాట్లాడుతున్న సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు ప్రసాద్ శర్మ

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

- రాష్ట్ర మంత్రి టి జి భరత్ - కర్నూల్లోని పలు ప్రాంతాల్లో మంత్రి టిజి.భరత్ ఆకస్మిక పర్యటన
- రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు ఆదేశాలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని పలు ప్రాంతాల్లో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ ఆకస్మికంగా పర్యటించారు. నగరంలోని 46వ వార్డు పరిధిలోని కెవిఆర్ కాలేజీ వెనుక ప్రాంతమైన బాబూ జగ్జీవన్ రామ్ నగర్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో పర్యటించిన సందర్భంగా గెలిచిన తర్వాత ఈ ప్రాంతవాసులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటానని హామీ ఇచ్చానని మంత్రి తెలిపారు. అందుకే సమస్యలు తెలుసుకునేందుకు వచ్చానన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలు తీర్చాలని మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజకు చెప్పారు. సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు. అనంతరం కెవిఆర్ కాలేజీ నుండి బంగారుపేట మీదుగా ఆనంద్ థియేటర్ వరకు ఉన్న రోడ్డు మార్గాన వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే నగరంలో ట్రాఫిక్ కష్టాలు తగ్గుతాయన్నారు. ఇక్కడ నివాసం ఉంటున్న ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించి ఈ రోడ్డు మార్గం తీసుకొస్తామని మంత్రి తెలిపారు. అనంతరం ఆనంద్ థియేటర్ ఎదురుగా హంద్రి బ్రిడ్జి పరిసరాలను పరిశీలించారు. ఈ ప్రాంతంలో వ్యర్థాలు డంప్ చేస్తున్నారని, రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అధికారులతో మాట్లాడి ఈ ప్రాంతంలో గ్రీనరీ ఏర్పాటుచేసి మంచి వాతావరణం ఏర్పాటయ్యేలా కృషి చేస్తానన్నారు. అనంతరం పాతబస్టాండులోని గడియారం ఆస్పత్రిని మంత్రి టిజి భరత్ సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పదేళ్ల నుండి ఇక్కడ వైద్యులు లేక వైద్యం అందడం లేదన్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. త్వరలోనే వైద్యుల నియామకం అయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాతబస్తీ వాసులకు ఎంతో ముఖ్యమైన గడియారం ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఒక్కొక్కటిగా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తాను ముందుకు వెళుతున్నట్లు టిజి భరత్ చెప్పారు. మంత్రి వెంట కార్పొరేటర్ పరమేష్, తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు అబ్బాస్, కర్నూలు నగర మైనారిటీ అధ్యక్షుడు హమీద్, మహిళా నాయకురాలు సంజీవలక్ష్మి, మారుతీశర్మ, నాయకులు సురేష్, సముద్రాల శ్రీధర్, చేపల రమేష్, జూటూరు రవి, గణేష్ సింగ్, యూనుస్ బాషా, పలువురు బూత్ ఇంచార్జీలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి టిజి

కళ్లు లేని జీవితం అంధకారం

- ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్న విధంగా మానవుని శరీరంలో పంచేంద్రియాలలో నయనం (కన్ను) ప్రధానమైనదని, అలాంటి కళ్లు లేని మానవ జీవితం అంధకారం అని సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు ప్రసాద్ శర్మ అన్నారు. బుధవారం సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, భరత్ హాస్పిటల్ సౌజన్యంతో ఉజ్వల, ప్రగతి మహిళా ఫెడరేషన్ల ఆధ్వర్యంలో ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీ (జంపాల అపార్ట్మెంట్ వెనుక) గెలాక్సీ స్కూలులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రసాద్ శర్మ మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్ప అన్న విధంగా, అన్ని అవయవాల్లో కెల్ల కన్ను పాత్ర ప్రధానమైనదని అన్నారు. కంటి ప్రాధాన్యతను గుర్తించి ఉజ్వల, ప్రగతి మహిళా ఫెడరేషన్ల ఆర్పీలు ఇలాంటి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. చూపు మందగించిన వెంటనే కంటి వైద్య నిపుణులను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే అంధత్వం రాదన్నారు. కంటిలో శుక్లాలు వచ్చినట్లయితే ప్రభుత్వం ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేసేందుకు ఆరోగ్యశ్రీ ప్రవేశ పెట్టింది. దాని ద్వారా ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయించుకోవచ్చన్నారు. కంటి శస్త్ర చికిత్స చేసేందుకు భరత్ హాస్పిటల్ వారు ముందుకు రావడం చాలా సంతోషదాయకమన్నారు. ఈ శిబిరాన్ని చిన్నపిల్లల నుండి వయోవృద్ధుల వరకు వినియోగించుకున్నందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ నగర్‌లోని సుందరయ్య భవన్ నందు ప్రతి రెండు నెలలకోసారి షుగర్ ,బిపి , మూర్చ, పక్షవాతం రోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులు కేవలం రూ.200 ఇస్తున్నామని ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని కూడా నగరంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో భరత్ హాస్పిటల్ ఆప్తాలమిస్ట్ రవి, తరుణ్, దేవరాజ్‌లు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి సూచనలను అందించారు. ఉజ్వల, ప్రగతి మహిళా ఐక్య సంఘాల ఆర్పీలు రుద్రమ్మ ,జ్యోతి, పుణ్యవతి టిఎల్ఎఫ్ ఆర్‌పి శివ లీల, ఈసీ మెంబర్ కె.మహేశ్వరి, మాధవి, సి .ఇందిర, భవాని, మద్దిలేటి, మెప్మా ఆర్పీల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. ఉమాదేవి, చిల్డ్రన్స్ క్లబ్ లక్ష్మీ నగర్ కన్వీనర్ సుశాంత్ చారి, సుందరయ్య అభిమాని వి.వెంకటేశ్వర్లు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు జెఎన్. శేషయ్య, రంగస్వామి, గెలాక్సీ స్కూలు ఇన్చార్జి మాధవి, ఉపాధ్యాయుడు పురుషోత్తం, తమ సేవలను అందించి పర్యవేక్షించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి సహాయ సహకారాలు అందించిన, వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు.

పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూల్ నగర శివారు లోని దిన్నెదేవరపాడులో నూతనంగా నిర్మించిన ఎపిఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ బిల్డింగ్‌నకు తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి బుధవారం మేయర్ బివై. రామయ్య, ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బొగ్గుల దస్తగిరి భూమిపూజ చేశారు. సదరు బిల్డింగ్ నగరపాలక పరిధికి దూరంగా ఉండటం కారణంగా వారి విజ్ఞప్తి మేరకు పైప్‌లైన్ వేయడానికి పాలకవర్గం ఆమోదం తెలిపింది. దీంతో పైప్‌లైన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. విద్యుత్ శాఖ అధికారులు డిపాజిట్ చేసిన రూ.20 లక్షలతోనే ఈ పనులు చేపడుతున్నారు. వారు వినియోగించిన నీటికి ప్రతినెలా రుసుం చెల్లిస్తారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్ వైజ.అరుణ, విద్యుత్ శాఖ ఎస్ఇ. ఉమాపతి, నగరపాలక ఎంఇ. శేషసాయి, ఎఇ జనార్ధన్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ రఫిక్ నాయకులు రాఘవేంద్రారెడ్డి, దివాకర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, సంపద దివాకర్ రెడ్డి, గంగాధర్ గౌడ్, సుదర్శన్ రెడ్డి, భరత నాయక్ , లక్ష్మణ్, బాబు, రాజు, శేఖర్, భరత్, మురళి, సాయి విష్ణు దేవా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

జిజిహెచ్ ఎంఎస్ ఫైవ్‌లో

అధ్వానంగా టాయిలెట్లు

- స్త్రీ పురుషులకు ఒకే టాయిలెట్ వినియోగం
- మండిపడుతున్న రోగులు, అటెండర్లు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ సర్వజన వైద్యశాల బూత్ బంగ్లా ఎంఎస్ 5 లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని సిపిఎం నగర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు సుధాకరప్ప, సభ్యులు జి. ఏసు నాయకులు మండిపడ్డారు. బుధవారం జిజిహెచ్ లోని ఎమ్మెస్ 5 వార్డును సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు పురుషులకు ఒకే మరుగుదొడ్డి వినియోగిస్తున్నారని, వాటికి కూడా డోర్లు లేని పరిస్థితి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు జిల్లాలకు తలమానికంగా, పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్న ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులు పడుతున్న బాధలు కష్టాలు, వర్ణనాతీతమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు వస్తే పడుకోవడానికి బెడ్లు లేక ఒకే బెడ్ పై ఇద్దరికీ వైద్యం అందించడం అతి దారుణమని తెలిపారు. మహిళలు పురుషులు కలిసి ఒకే మరుగు దొడ్డి లోకి వెళుతున్నారని, కనీసం మరుగుదొడ్డికి వాకిళ్లు కూడా సరిగా లేవని అందువల్ల రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైద్యం కోసం వచ్చిన వారు అక్కడ బెడ్లు లేక ఒకే బెడ్ పై ఇద్దరినీ పడుకోబెట్టి సెలైన్ బాటిల్ ఎక్కించే పరిస్థితి ఉందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను అభివృద్ధి చేస్తామన్న ఒకవైపు గొప్ప గొప్ప మాటలు చెబుతూ మరో వైపు ఇలాంటి దృశ్యాలు అనేకం ఆసుపత్రిలో కనబడుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరిండెంట్, కలెక్టర్, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు.



నేటి నుంచి లెప్రసీ కేస్ క్యాంపెయిన్

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా వ్యాప్తంగా లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ ఈనెల 18 నుండి ఆగస్టు రెండవ తేదీ వరకు 14 రోజులు లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని జిల్లా కుష్టు ఎయిడ్స్ టీబీ నివారణ అధికారి డాక్టర్ భాస్కర్ తెలిపారు. బుధవారం జిజిహెచ్ లోనే 36వ నెంబర్ గదిలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపియన్ వాల్పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ఆశాలు, పురుష వాలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే చేస్తారని అన్నారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, నరాల వాపు, జోములు, చేతుల నుండి వస్తువులు జారిపోవుట , కాళ్ల నుండి చెప్పులు జారిపోవుట మొదలగునవి కుష్టు వ్యాధి లక్షణాలు అన్నారు. అనుమానిత లక్షణాలు వుంటే సమీప ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌తో చూపించు కొని వ్యాధి నిర్ధారణ చేసుకొని, ఎండిటి మందులు ఉచితంగా పొందవచ్చునని జిల్లా కుష్టు, ఎయిడ్స్ అండ్ టిబి అధికార్ డాక్టర్ బాస్కర్ తెలిపారు. జిల్లా న్యూక్లియస్ అధికారి డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక దశలో వ్యాధి కనుక్కొని ఎండిటి మందులు వాడితే, అంగవైకల్యం రాకుండా చూసుకోవచ్చునని తెలిపారు. డిపిఎం సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రజలు , వైద్య ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు, మెడికల్ ఆఫీసర్ లు కలిసి ఈ కార్య క్రమం తప్పకుండా జయ ప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బ్యానర్ లు, గోడ పత్రాలు, కర పత్రాలు డాక్టర్ భాస్కర్ ఆవిష్కరించారు.

పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేయాలి : రైతుసంఘం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

పేదలు సాగు చేసుకుంటున్న భూములకు వెంటనే పట్టా పాస్ పుస్తకాలను మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి ఎస్.మధుసూదన్ డిమాండ్ చేశారు. బుధవారం ఓర్వకలు మండలం లోద్దిపల్లె గ్రామంలో భూములు సాగు చేస్తున్న పేదల పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న ఎపి రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి ఎస్ మధుసూదన్ , వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు రామస్వామి, మాసుంబాష లు ఉన్నారు. ఓర్వకల్ మండలంలో వివిధ గ్రామాలలో గత 15 నుంచి 20 సంవత్సరాలుగా రూ.50 వేల నుండి రూ.లక్ష దాకా ఖర్చు చేసి భూములను సాగు చేశారన్నారు. వారికి ఈ భూములు తప్ప మరే ఇతర భూములు లేవని, రెక్కాడితే గాని డొక్కాడే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో సాగు చేసుకున్న పేదలకు పట్టా పాస్ పుస్తకాల మంజూరు చేస్తామని చెప్పడంతో అనేకమంది వ్యవసాయ కార్మికులు మండల తహసిల్దార్ కు అర్జీ పెట్టుకున్నారన్నారు . వెంటనే ఎమ్మెల్యే తో పాటు కలెక్టర్ జోక్యం చేసుకుని పేదల భూములకు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాగు చేస్తున్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

మా బలం నువ్వే లక్ష్మమ్మా

మరో ఏడు గడిచింది కదమ్మా
ఓ లక్ష్మమ్మా మా అందరి అమ్మా
నీ స్ఫూర్తితో ధైర్యం తెచ్చుకొని
నీ మాటలతో మనసు నింపుకొని
జనారణ్యంలోకి రోజూ
దూకుతునే ఉన్నామమ్మా
కట్నాల ఆరళ్ళు ఆగడం లేదు
అతివల కన్నీళ్లకు కొదువలేదు
చిన్నారులు మైనర్లే కాదు
ఐదునెల్ల పాప కూడా
నేడు క్రూర మగాలకు
ఓ స్త్రీగానే కనిపిస్తోందమ్మా
ఈ దాష్టీకాలను ఎదుర్కొనే
ఉద్యమబాటలో నిరంతరంగా
పోరాటాలు చేస్తూనే ఉంటాము
మొక్కవోని నీ దీక్షను
నిత్యం మననం చేసుకుంటూ
సదా పోరులో ముందుంటాము
నీలాంటి స్త్రీ శక్తి
సంకేతాలను సందేశాలను
కడదాకా మోసుకెళ్తాము
ఘన విజయం సాధిస్తాము



- జంధ్యాల రఘుబాబు

(కామ్రేడ్ టిసి.లక్ష్మమ్మ తొమ్మిదవ వర్ధంతి, 18.07.2024 సందర్భంగా)

మతకలహాలు, కల్లోలాలు ఉన్న దేశాలకు ప్రశాంతత కరువు

మొహర్రం సందర్భంగా నిరుపేద హిందూ, ముస్లిం మహిళలకు చీరలను పంపిణీ చేసిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రపంచంలో మతకలహాలు, కల్లోలాలు ఉన్న ఏ దేశంలో ప్రజలు ఆనందంగా ఉన్న దాఖలాలు లేవని, ఆ దేశాల్లో జాతితో పాటు దేశం తీవ్రంగా దెబ్బ తింటుందని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. మతసామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో నిరుపేద హిందూ, ముస్లిం మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం పర్వదినాన్ని హిందూ ముస్లింలు కలిసికట్టుగా చేసుకోవడం అభినందనీయమని చెప్పారు. మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని హిందూ ముస్లిం పేద మహిళలకు చీరలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మతసామరస్యం ఎంతో అవసరమని ఆయన వివరించారు. మతకలహాలు, కల్లోలాలు చెలరేగితే ఆ దేశాలు అన్ని రంగాల్లో విచ్ఛిన్నమైపోతాయని ఆయన తెలిపారు. మతకలహాలు, కల్లోలాల వల్ల ఆసియా ఖండంలో అనేక దేశాలు నాశనం అయ్యాయని, మతకలహాలు ప్రస్తుతం యూరోపియన్ దేశాల్లో కూడా మొదలు కావడం దురదృష్టకరమని అన్నారు. మతకలహాల వల్లఆయా దేశాల్లోస్త్రీలు,చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. భిన్న జాతులు, తెగలు, మతాలు మన దేశంలో ఉన్నాయని, ఇలాంటి దేశాల్లో భిన్న మతాల మధ్య బ్యాలెన్స్ దెబ్బ తినకుండా కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. మత కలహాలు, కల్లోలాల వల్ల ఆయా దేశాల్లో దేశ అంతర్గత భద్రత దెబ్బతినడంతో పాటు విదేశీ పెట్టుబడులు ,పారిశ్రామిక రంగం, విద్యారంగం ఇలా అన్ని రంగాలు తీవ్రంగా దెబ్బ తింటాయని తెలిపారు. స్త్రీలకు స్వాతంత్రం ఎంతో అవసరమని అప్పుడే దేశం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని తెలిపారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

నేడు నగరపాలక స్థాయీ సంఘ ఎన్నికకు నోటిఫికేషన్

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థ స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ జారీ చేస్తామని కమిషనర్ ఏ.ఎ.భార్గవ్ తేజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక కార్యాలయంలో ప్రభుత్వ సెలవులు ఉన్ననూ ప్రతి రోజు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటలలోపు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయవచ్చన్నారు. నామినేషన్‌కి ఈనెల 24వ తేదీ చివరిరోజు అని పేర్కొన్నారు. అభ్యర్థికి ఒక కార్పొరేటర్ బలపర్చాల్సి ఉంటుందని, అయిదుగురు సభ్యులను ఎన్నుకొనుటకు ఒక కార్పొరేటరుకు కనీసం అయిదు (5) ఓట్లు వేసే అర్హత ఉంటుందని కమిషనర్ తెలిపారు.

ఎస్‌పిని కలిసిన నగరపాలక కమిషనర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



జిల్లాపోలీస్ కార్యాలయంలో నూతన ఎస్‌పి జి.బిందు మాధవ్‌ను బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌పికి కమిషనర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



వెల్దుర్తిలో మొహర్రం సందర్భంగా పీర్ల ఊరేగింపు దృశ్యం

ప్రశాంతంగా ముగిసిన మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి పట్టణంలో నాలుగు రోజుల నుండి జరుగుతున్న మొహర్రం వేడుకలు బుధవారం రాత్రి ముగిశాయి. పీర్ల చావిడిలలోని పీర్లను తీసుకొని ఊరేగింపుగా భక్తుల కొలహాల మధ్య భక్తిశ్రద్ధలతో అలైబలై ఆడుతూ ఏటికి తీసుకెళ్లారు. భక్తులు పీర్ల స్వాములకు మొక్కుబడిగా పోటీస్కమ్ , ఆడవారి వేషధారణతో సందడిగా నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ మధుసూదన్ రావు , ఎస్ఐ సునీల్ కుమార్ పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

సి బెళగల్ : మండలంలోనీ అన్నీ గ్రామాల్లో మొహర్రం వేడుకలు బుధవారం భక్తి శ్రద్ధలతో జరిగాయి. సుమారు 36 మసీదులలో పీర్లను కొలువు చేసి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇక్కడే చివరి రోజు వేడుకలు భక్తి శ్రద్ధలతో జరుగగా త్యాగాలకు ప్రతీక ఈ మొహర్రం అని ఆయా మత పెద్దలు, భక్త బోధకులు మీడియాలో పేర్కొన్నారు.

బాలికను హత్య చేసిన వారిని ఉరితీయాలి

కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ ఉమాదేవి డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం ముచ్చుమర్రి గ్రామంలో 11 రోజుల క్రితం 9 ఏళ్ల బాలిక అదృశ్యం మిస్టరీ వీడింది. బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను అందుకు సహకరించిన తండ్రులను, మరొకరు ఎలాంటి పని చేయకుండా ఉరితీయాలని కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ ఉమాదేవి బుధవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్నపిల్లలు మొదలుకొని వయోవృద్ధుల వరకు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు హత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని అందుకు ప్రధానంగా మద్యం, సెల్ ఫోన్‌లు కారణమన్నారు. యూట్యూబ్, వాట్సప్‌లలో మంచికి ఉపయోగపడే వాటిని మాత్రమే ఉంచాలని, యూట్యూబ్, వాట్సాప్‌లలో పెడ తోవ పట్టించే విధంగా ఉండే వాటిని ప్రభుత్వం వెంటనే బ్యాన్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు ,హత్యలను నివారించేందుకు ప్రభుత్వం కఠినమైన చట్టాలను చేసి వాటిని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.


విలువిద్యలో ప్రావీణ్యుడు ఏకలవ్య

ఆంధ్రప్రదేశ్ ఎరుకల హక్కుల పోరాట సమితి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ :ఆదివాసి ఎరుకల వీరుడు ఏకలవ్యుడు విలువిద్యలో మంచి ప్రావీణ్యం పొందాలని జాతి పోరాటంలో అగ్రగామిగా నిలిచారని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరుకల రాజు, జిల్లా అధ్యక్షులు ఎరుకలహరి అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని స్థానిక ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎరుకల హరి అధ్యక్షతన తొలి ఏకాదశి రోజును పురస్కరించుకొని ఆదివాసి మూలపురుషుడైనా ఏకలవ్యుని జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకల రాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు కుమార్, విశ్రాంతి స్పెషల్ కలెక్టర్ ఎస్.రామస్వామి, బీసీ జన సభ నాయకులు శేషఫణి , 34వ వార్డు కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్లు ఎరుకల వెంకటస్వామి, గున్న మార్కు, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు మద్దయ్య, ఎరుకలరమేష్,, సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవికుమార్ పాల్గొని ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించారు. ఘనంగా నిర్వహించారు. విశ్రాంతి స్పెషల్ కలెక్టర్ ఎస్.రామస్వామి, వైహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకల రాజు, బిసి జన సభ నాయకులు శేషఫణి మాట్లాడుతూ ఆదివాసి ఎరుకల వీరుడు ఏకలవ్యుడని ఇండియా ఉపఖండంలో ఎరుకల తెగను వివిధ పేర్లతో పిలువబడుతున్నప్పటికీ ఏకలవ్యుని మాత్రం అన్ని తెగలు తమ జాతి పోరాట నాయకునిగా చెప్పుకుంటున్నారని తమ జాతికి జరిగిన అన్యాయం భవిష్యత్తులో జరగకూడదని భావిస్తూ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏకలవ్యుని గుర్తు చేసుకోవడం స్ఫూర్తి దాయకమన్నారు. చరిత్రలో పాలకుల వలన మన ఎరుకల జాతికి తీరని అన్యాయం జరిగిందని నేటికీ కూడా మన ఎరుకల జాతి అసమానతలకు, అన్యాయాలకు గురికాబడుతూనే ఉందని వాటిపై పోరాటానికి ఏకలవ్యుని అదర్శంగా తీసుకొని పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమమలో నాయకులు ఎరుకల గోపి, ఎరుకల శ్రీనివాసులు, తరుణ్, హరీష్, జగన్, బాబ్జీ వినయ్, అరుణ్, సాగర్, మహేంద్ర, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఏకలవ్య కు ఘనంగా నివాళి అర్పిస్తున్న నాయకులు



సూర్యనారాయణ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- కర్నూలు అగ్రికల్చర్

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం దక్షిణాయన పుణ్య కాలం కర్కాటక సంక్రమణ ఆశేష భక్తజన సమూహంలో శ్రీ సూర్యనారాయణ స్వామివారి మూలవిరాట్‌కు సుగంధ ద్రవ్య జలాభిషేకం క్షీరాభిషేకం నిర్వహించామని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ భక్తాదులు స్వయంగా కలశంతో సప్త ప్రదక్షణలు చేసి శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఉత్సవ విగ్రహమునకు అభిషేకం నిర్వహించుకున్నారన్నారు. అనంతరం విశేషంగా సూర్యనారాయణ మూర్తికి అలంకారంచేసి అర్చన, మహా మంగళహారతి, మంత్రపుష్పం, వేద స్వస్తి నిర్వహించారు. శ్రీ సూర్య దత్త గోశాలలో భగవద్గీత పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వేద ఆశీర్వచనం అందించమన్నారు. భక్తులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రి స్థాయి పెరిగినా..!

- పెరగని సిబ్బంది - రోగులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - ఆదోని

చిన్నపాటి గాయాలతో ఆస్పత్రికి అంబులెన్స్‌లో వచ్చిన బాధితులకు మెరుగైన వైద్యం అందాల్సి ఉంది. ఆదోని ఆస్పత్రిలో రోగులను పరీక్షించిన వైద్యులు కర్నూలు ఆస్పత్రికి వెళ్లాలని సూచించడం పరిపాటిగా మారింది. ఇక్కడి నుంచి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నూలు ప్రభుత్వాస్పత్రికి చేరుకునేలోపు చాలామంది రోగులు మృతి చెదుతున్నారు. ఆస్పత్రి స్థాయి పెంచాలని వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు పలు దఫాలుగా ఆందోళన నిర్వహించారు. ప్రస్తుతం ఆస్పత్రి స్థాయి పెరిగినా చికిత్సలో ఎలాంటి మార్పూ లేదని పలువురు రోగులు చెబుతున్నారు.

ఆస్పత్రి స్థాయి పెరిగినా..!

రెవెన్యూ డివిజన్ కేంద్రమైన ఆదోనిలో ప్రభుత్వాస్పత్రి స్థాయి జనరల్ ఆస్పత్రిగా మారినా రోగులకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగా మారిందని పలువురు చెబుతున్నారు. ఆస్పత్రిలో బెడ్ల సంఖ్య పెరిగినప్పటికీ సేవలు అందించాల్సిన నర్సులు, వైద్య సిబ్బంది లేకపోవడంతో అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉందని చికిత్స పొందుతున్న రోగులు వాపోతున్నారు. 100 పడకలుగా ఉన్న ఆస్పత్రిలో ప్రస్తుతం 340 పడకలకు అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. జ్వరం, ఆయాసం, దగ్గు, ఇతర వ్యాధులతో సుమారు 200 మంది రోగులు ఇన్‌పేషెంట్లుగా ఉన్నారని చెబుతున్నారు.

నాణ్యమైన మందులు ఇవ్వాలి

చికిత్స కోసం చేరిన రోగులకు పారాసెటమల్, అమాక్షన్, సిటిజన్, డైక్లో, ఫెనైక్, ఫిరోజ్, జోల్డెన్, ఇతరత్రా మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని రోగులు చెబుతున్నారు. ఇంకా నాణ్యమైన మందులు సరఫరా చేసి రోగులు త్వరగా కోలుకునేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆదోని ప్రభుత్వాస్పత్రి



ఒపి కోసం క్యూలో నిలిచిన రోగులు

పని భారంతో అల్లాడుతున్న నర్సులు

వంద పడకల నుంచి 340 పడతలకు ఆస్పత్రి స్థాయి పెరగడంతో రోగుల సంఖ్య కూడా పెరిగింది. వారికి సేవలు అందించేందుకు ఉన్న స్టాఫ్ నర్సులు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉంది. 200 మంది నర్సులు ఉండాల్సి ఉండగా కేవలం 20 మంది మాత్రమే సేవలు అందిస్తున్నారు. పై అంతస్తులో ఉన్న రోగులకు సేవలు అందించేందుకు ఎక్కలేక, దిగలేక అవస్థలు పడుతున్నామని నర్సులు వాపోతున్నారు. ఇతర స్టాఫ్ కూడా లేకపోవడం వల్ల ఉన్నవారిపైనే పని భారం పడుతుందని ఆందోళన చెందుతున్నారు.

పెరగని డాక్టర్ల సంఖ్య

ప్రభుత్వాస్పత్రిలో మానసిక వైద్యులు, జనరల్ ఫిజీషియన్, చెవి, ముక్కు, కంటి, డెంటల్, చర్మవ్యాధి, మత్తు తదితర వ్యాధులకు సంబంధించిన స్పెషలిస్టులు రోగులకు సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రికి రోజుకు 350 మంది దాకా అవుట్ పేషెంట్లే వస్తున్నారని చెబుతున్నారు. రోగులకు సంఖ్యకు అనుగుణంగా వైద్యులు లేకపోవడంతో ఉన్నవారే అదనంగా డ్యూటీలు చేస్తూ మానసిక ఆందోళన గురవుతున్నామని వాపోతున్నారు. 180 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఆస్పత్రిలో కొత్తగా చేరిన వారితో కలిపి 72 మంది డాక్టర్లు సేవలు అందిస్తున్నారు. పూర్తిస్థాయిలో స్టాఫ్‌ను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వివరాలను ప్రభుత్వానికి నివేదించాం

- శ్రీరాములు, ఆస్పత్రి సూపరింటెండెంట్



ఆస్పత్రిలో వైద్యులు, నర్సులు, మెడికల్ సిబ్బంది ఖాళీల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. ఆస్పత్రి స్థాయి పెరగడం వల్ల ఉద్యోగుల సంఖ్య కూడా పెరుగుతోంది. త్వరలోనే నియామకాలు జరుగుతాయి. ఇక్కడకు వచ్చిన పేషెంట్లకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నాం. స్పెషలిస్టులు అందుబాటులో ఉన్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు కూడా చొరవ తీసుకుంటాం.



నీటితో కళకళలాడుతున్న తుంగభద్ర డ్యామ్

తుంగభద్రకు పోటెత్తిన వరద

- 63 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో - 42 టిఎంసిలకు చేరిన నీటి నిల్వ

ప్రజాశక్తి - హోళగుంద

కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ, ధవనగిరి, రాణి బెన్నూర్, తదితర ప్రాంతాల్లో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్ కు వరద పోటెత్తింది. ప్రస్తుతం రోజుకు 63 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. గత వారం రోజులుగా రోజుకు 20 వేల నుంచి 30 వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రస్తుతం తుఫాను ప్రభావంతో అధిక వర్షాలు కురుస్తుండడంతో రోజుకు 63 వేల వరకు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర బుధవారం తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 42 టిఎంసిల నీటి నిల్వ ఉంది. ఈ రెండు, మూడు రోజుల్లో రుతుపవనాల ప్రభావం కారణంగా మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. గతేడాది జూన్, జులై నెలలో ఎలాంటి ఇన్‌ఫ్లో ఉండేది కాదు. ఈ ఏడాది జులై నెలలో ఇన్‌ఫ్లో మొదలు కావడంతో త్వరలో డ్యామ్‌లోకి నీరు చేరే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చర్చించుకుంటున్నారు. తుంగభద్ర డ్యామ్, ఎల్‌ఎల్‌సి కాలువపై ఆధారపడిన రైతులు తమ పొలాల్లో దుక్కు దున్నులు మొదలుపెట్టారు. గతేడాది వర్షాలు లేక బెంగళూరు, ముంబయి వంటి ప్రాంతాలకు వలస వెళ్లిన రైతులు సైతం గ్రామాలకు వచ్చి చేరుకొని తమ తమ పొలాల్లో పనులు చేసుకుంటున్నారు. తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే మరో పది రోజుల్లో తుంగభద్ర డ్యామ్‌కు గరిష్ట సాయి నీటిమట్టం 105 టిఎంసిలకు చేరుకునే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు పేర్కొంటున్నారు.

తాగునీటి కోసం ఎల్‌ఎల్‌సికి నీటి విడుదల

తుంగభద్ర డ్యామ్ నుంచి ఎల్‌ఎల్‌సి కాలువకు తాగునీటి అవసరాల నిమిత్తం బుధవారం ఉదయం 300 క్యూసెక్కుల నీటిని బోర్డు అధికారులు విడుదల చేశారు. వరద తీవ్రతను బట్టి 1500 క్యూసెక్కులు పెంచి నీటిని విడుదల చేస్తున్నట్లు సమాచారం.

పూర్తిస్థాయిలో సాగు, తాగునీరు

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని



ఎల్ఎల్‌సి డయాగ్రామ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆదోని నియోజకవర్గంలోని ప్రతి ఆయకట్టు భూమికి, ప్రజలకు సాగు, తాగునీరు పూర్తి స్థాయిలో అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి టిబి అధికారులకు సూచించారు. బుధవారం ఆదోనిలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్‌ఎల్‌సి పరిధిలో 6 వేల ఎకరాల ఆయకట్టు భూమికి సాగు నీరు అందిస్తున్నామని తుంగభద్ర దిగువ కాలువ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శైలేశ్వర్, అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అవసరమైన కొంత భూమికి నీరందించే ప్రయత్నం చేస్తామన్నారు. ఒకటి, రెండు రోజుల్లో టిబి డ్యామ్ గేట్లు ఎత్తివేస్తారని, తాగు నీటికి ఇబ్బంది పడే పరిస్థితి ఉండదని తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ప్రాజెక్టు పనులను, భవిషత్తులో అవసరమైన ప్రాజెక్టులకు వెంటనే రిక్వెస్ట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. టిబిపి సబ్ డివిజన్-1 డిఇఇ షఫీ, ఎఇలు కె.రంగస్వామి, ఎం.ఈశ్వర్, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆదోనిలో ఘనంగా లాయర్స్ డే

ప్రజాశక్తి - ఆదోని



లాయర్లను సన్మానిస్తున్న దృశ్యం

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) ఆధ్వర్యంలో ప్రపంచ న్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదోనిలోని వామ్ కార్యాలయంలో ప్రముఖ ఆర్యవైశ్య న్యాయవాదులు టి.రవీంద్ర, టిజి.బాల త్రివేణి, చిన్న ఈరన్నను సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణ వామ్ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడారు. న్యాయవాదుల ద్వారా సమాజానికి న్యాయపరమైన ఇబ్బందులు పరిష్కారమవుతాయని తెలిపారు. వామ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, రఘు, ఉపాధ్యక్షులు యాదగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు ప్రసాద్ రావు, వామ్ మహిళా విభాగం అధ్యక్షులు వంకదారు మమతశ్రీ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు తగదు

- జర్నలిస్టు నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

వైసిపి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి విశాఖపట్నం మీడియా సమావేశంలో జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని జర్నలిస్టు నాయకులు తెలిపారు. బుధవారం ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విజయసాయి రెడ్డి వ్యాఖ్యలు జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. మహా న్యూస్, ఎబిఎన్, టివి 5, ఈటీవీ, సివిఆర్ న్యూస్ జర్నలిస్టులను 'వీడు, వాడు, ఒరే బాబు' అంటూ సంబోధించడం మంచి పద్ధతి కాదన్నారు. జర్నలిస్టులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, ఆయనపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎస్పీ శివ నారాయణస్వామికి ఫిర్యాదు చేశారు. యూట్యూబర్లు అంటూ కొందరు ప్రెస్ స్టిక్కర్లు బైక్‌పై వేసుకొని వాహనాలు నడుపుతూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని ఫిర్యాదు చేశారు. అర్హులైన వారిని మాత్రమే ప్రెస్‌మీట్లకు పిలవాలని, నకిలీ జర్నలిస్టులపై నిఘా ఉంచాలని కోరారు. త్వరలోనే డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు ఎపిడబ్ల్యుజె అధ్యక్షులు మల్లికార్జున, మహా న్యూస్ రవి, ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రధాన కార్యదర్శి మునెప్ప, కోశాధికారి సుధాకర్, భీమా, మురళీ, పురుషోత్తం, ఖాన్, విజయ్, యువరాజ్, రమేష్ రెడ్డి, రాము, ఆంధ్రజ్యోతి రవి, చిన్న భీమా, నవీన్, తిమ్మప్ప పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



రోడ్లపై పశువులను ఉంచే

యజమానులపై చర్యలు

- కమిషనర్ రామచంద్రరెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

రోడ్డుపై పశువుల నుంచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే యజమానులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడారు. పురపాలక సంఘం పరిధిలో రోడ్లపై పశువులు తిరగకుండా వాటి యజమానులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపైకి వచ్చే పశువులను పురపాలక సంఘం వారు స్వాధీనం చేసుకొని గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. సంబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు. రోడ్లపై పశువులు విచ్చలవిడిగా తిరుగుతుండడంతో అరికట్టేందుకు పశువుల యజమానులకు హెచ్చరికలు జారీ చేస్తూ ఉన్నామన్నారు. పట్టణంలో రోడ్డుపై విచ్చలవిడిగా తిరిగేటు పశువులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతోపాటు ప్రయాణికులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారని తెలిపారు. పశువుల యజమానులకు పశువులను రోడ్లపై వదలరాదని గతంలోనే నోటీసులు జారీ చేశామని చెప్పారు. పశువుల యజమానులు బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, నోటీసులను పెడచెవిన పెట్టి పశువులను బయటకు వదిలేస్తున్నారని తెలిపారు. ఈ విధంగా బయటికి వచ్చిన పశువులు రోడ్లపై అడ్డదిడ్డంగా తిరుగుతూ ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నాయని చెప్పారు. వీటి వల్ల గతంలో ప్రమాదాలు జరిగి అనేకమంది గాయాలపాలయ్యారని తెలిపారు. ప్రాణాలు సైతం కోల్పోయారని వివరించారు. రోడ్డుపై పశువులు కనిపిస్తే వాటి యజమానులకు ఏ విధమైన నోటీసు ఇవ్వకుండా పశువులను మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు. పశువుల యజమానులు క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆ కేసుల పరిష్కారానికి ఆదోని న్యాయ పరిధి వర్తిస్తుందని తెలిపారు. పశువుల యజమానులు నిర్లక్ష్యంగా పశువులను బయటికి వదలకుండా పురపాలక సంఘం వారికి సహకరించాలని కోరారు.

ఎస్పీని కలిసిన వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - ఆలూరు

జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బిందు మాధవ్‌ను బుధవారం టిడిపి సీనియర్ నాయకులు వీరభద్ర గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతలు పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ముగిసిన మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని ఆయా గ్రామాల్లో పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన మొహర్రం వేడుకలు ప్రశాంతంగా ముగిసినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. బుధవారం యువకులు పలు వేషధారణ ధరించి ఆడుతూపాడుతూ నృత్యాలు చేశారు. నేమకల్లులో మహిళలు పెద్దఎత్తున చక్కెర, టెంకాయ, పూలదండల వెండితో తయారు చేసిన ప్రతిమలు స్వాముల వారికి కానుకలుగా అందజేశారు. యువకులు మహిళల మాదిరిగా తయారయ్యి నృత్యాలు చేశారు. పలు వేషధారణలు ధరించారు. కుందనగుర్తి గ్రామంలో స్వామిపై భక్తి నిలిపి భక్తులు అగ్గి నిప్పుల మీద నడిచారు. సాయంత్రం వైభవంగా స్వాముల ఏటికి పోయే నేపథ్యంలో ప్రతిమను ఎత్తుకొని ప్రధాన రహదారి వెంట వెళ్తుండగా మహిళలు చదివింపులు చెల్లించుకున్నారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **హోళగుంద**లో భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు ముగిశాయి. మండలంలోని ప్రతి గ్రామంలో కొలువుదీరిన పీర్లకు గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలతో పాటు చక్కెర, ప్రసాదాలు, వివిధ రకాల పూజలు నిర్వహించారు. బుధవారం గ్రామ పురవీధుల గుండా వివిధ నృత్యాలతో, వేషధారణలతో పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లి బావి, చెరువులో నిమజ్జనం చేశారు. సంవత్సరానికి ఒక్కసారి వచ్చే పీర్ల పండగ సందర్భంగా చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్తును భక్తిశ్రద్ధలతో తిలకించారు. మండలంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ పెద్దనాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. **హాలహర్వి** మండలంలోని నిట్రవట్టి గ్రామం మినహా అన్ని గ్రామాల్లో కొలువుదీరిన పీర్లకు గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం గ్రామ పురవీధుల గుండా నృత్యాలతో, వేషాలతో పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లి బావి, నిమజ్జనం చేశారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. **కౌతాళం** మండలంలోని కౌతాళం హాల్వి, నదిచాగి, ఎరిగేరి, కుంటనహాల్, బదినేహాల్, ఉపరహాల్, రౌడూరు, బాపురం, గుడికంబాలి, వల్లూరు, ఉరుకుంద, చిరుతపల్లి, కామవరం తదితర గ్రామాల్లో పెద్ద పీర్ల పండగ వైభవంగా నిర్వహించారు. కాత్రికి గ్రామం మినహా అన్ని గ్రామాల్లో వెలసిన పీర్లకు గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌతాళంలోని శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గా నుంచి సవారీలు (ఊరేగింపు) డప్పు, వాయిద్యాలతో పురవీధుల గుండా నృత్యాలతో చేపట్టారు. అనంతరం కర్బలా మైదానానికి చేరుకొని నిమజ్జనం చేపట్టారు. మొహర్రం వేడుకలు ముగిశాయి. సిఐ ప్రసాద్, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు. **మంత్రాలయం**లోని ఖాజా హుస్సేన్ తాత, ముల్లా సాబ్‌ల ఆధ్వర్యంలో పీర్ల చావిడిలో కొలువైన ఇమామ్ ఖాసీం, ఇమామ్ హుస్సేన్ పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు చేసి అక్కడ నుంచి తుంగభద్ర నది వరకు తప్పెట్లు, భాజభజంత్రీల మధ్య ఊరేగించారు. శ్రీమఠం వెనుక భాగంలో ఉన్న పవిత్ర తుంగభద్రానదిలో పీర్లను నిమజ్జనం చేశారు. మండలంలోని వగరూరు, మాధవరం, సుంకేశ్వరి, రాంపురం, చిలకలడోన, కల్లుదేవకుంట, మాలపల్లి, కాచాపురం, సింగరాజనహల్లి, తిమ్మాపురం, ఖగ్గల్, రచ్చుమర్రి తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రాలయంలో జరిగిన మొహర్రం వేడుకల్లో భాగంగా పీర్ల ఊరేగింపులో సర్పంచి భీమయ్య, టిడిపి మండల అధ్యక్షులు, మాజీ సర్పంచి పన్నగ వెంకటేష్, అశోక్ రెడ్డి, వరదరాజులు, ఎంపిటిసి నక్కి వెంకటేష్, చిన్న సుంకప్ప, హండే అనుమంతు, వనికె నాగరాజు, గనేకంటి రఘు, గనేకంటి రామకృష్ణ పాల్గొన్నారు. మొహర్రం వేడుకల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎమ్మిగనూరు డీఎస్పీ ఆదేశాల మేరకు మంత్రాలయం సిఐ ఎరిషావలీ పర్యవేక్షణలో మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్, మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. **ఎమ్మిగనూరు** మండలంలోని కడివెళ్ల గ్రామంలో మాల మహానాడు రాయలసీమ జిల్లాల అధ్యక్షులు రంగయ్య, గ్రామ మాల పెద్దలు యువదళం యూత్ ఆధ్వర్యంలో మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. ఆయనకు ఘన స్వాగతం పలికారు. దళితవాడలో పర్యటించి దళిత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. జిల్లా అధ్యక్షులు మల్లేష్, పరమేష్, యువ నాయకులు నల్లన్న, బలరామ్, రాముడు, కేశవ, నరసింహ, తుకారం, ఆటో నరసింహ, గోపాల్, వినోద్ పాల్గొన్నారు. **కోసిగి** మండలంలో మొహర్రం వేడుకలను కులమతాలకు అతీతంగా నిర్వహించారు. మండలంలో మంగళవారం రాత్రంతా మొహరం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేకంగా అలంకరించిన పేర్లకు ఆయా గ్రామాల్లో భక్తులు పూలు దట్టీలు సమర్పించారు. మండలంలో హిందువులు, ముస్లింలు కలిసికట్టుగా పీర్ల ఎదుట డప్పు వాయిద్యాలతో ఆడి పాడిన అలయ్ బలయ్ కార్యక్రమం భక్తులకు ఆకట్టుకుంది. బుధవారం తెల్లవారుజామున మొహర్రం వేడుకలో భాగంగా గ్రామ పురవీధుల గుండా పీర్ల సవారితో గ్రామ వీధుల్లోకి రాగా భక్తులు దారి పొడవున నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాయంత్రం పీర్ల ఊరేగింపుతో ఉత్సవాలు ముగిశాయి. మండలంలో మొహర్రం వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ సతీష్ కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు. **దేవనకొండ** మండలంలోని తెర్నేకల్, నేలతలమర్రి, కప్పట్రాళ్ల, కోటకొండ, దేవనకొండ, బేతపల్లి, బంటుపల్లి, చెల్లెల చలిమల తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ముగిశాయి. ఆయా గ్రామాల్లో తప్పెట్లతో పీర్లను ఊరేగింపుగా వీధుల్లో తిరిగి అలాయి, బలాయి తీసుకొని నిమజ్జనానికి సాగనంపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐలు శ్రీనివాసులు, సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. **ఆస్పరి**తో పాటు శంకరబండ, చిరుమాన్ దొడ్డి, హాలిగెర, చిగిలి, తంగరడోణ, బిల్లేకల్లు తదితర గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు ఏటికి వెళ్లాయి. చావడి ముందు అలాయి గుంత చుట్టు చిన్న పెద్దా అన్ని తేడా లేకుండా సౌసన్ ఆడారు. సాయంత్రం పురవీధుల గుండా పీర్లను ఊరేగించారు. పీర్లను తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎలాంటి అవంచనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆస్పరి సిఐ హనుమంతప్ప బందోబస్తు నిర్వహించారు. **ఆలూరు** మొహర్రం సందర్భంగా చావిడిలో కొలువుదీరిన పీర్లను మండలం లోని మనెకుర్తి, అంగస్కాల్, ఆలూరు, మొలగవల్లి, హత్తిబెళగల్ తదితర గ్రామాల్లో ఏటికి తరలించారు. ఈ సందర్భంగా యువకులు, చిన్నారులు దులే అంటూ నృత్యాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



చిప్పగిరిలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



హోళగుందలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



హాలహర్విలో



కౌతాళంలో



మంత్రాలయంలో

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని 24వ వార్డుకు చెందిన నిరుపేద వడ్డే శ్రీనుకు చెందిన గుడిసె ప్రమాదశాత్తు విద్యుదఘాతానికి గురై పూర్తిగా కాలిపోయింది. బుధవారం టిడిపి 24వ వార్డు నాయకులు వెంకటేశ్వర రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి స్పందిస్తూ తహశీల్దార్‌కు సమాచారం అందించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకొని పంచనామా చేయించి ప్రభుత్వం ద్వారా బాధితులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సహాయం కింద బాధితులకు 120 కిలోల బియ్యం, 15 రోజులకు సరిపడే నిత్యావసర సరుకులు, బట్టలు, రూ.5 వేల నగదును అందించారు. విశ్రాంత ఉద్యోగి వెంకటేశ్వర్లు, మల్లయ్య, వెంకటేశ్వర రెడ్డి, గౌడ్, వార్డు నాయకులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

డయేరియా తగ్గేంత వరకు గ్రామంలో వైద్యాధికారులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశించారు. బుధవారం ఆదోని ప్రభుత్వాస్పత్రిలో ఆకస్మిక తనిఖీ చేసి అతిసార వ్యాధితో బాధపడుతున్న మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామవాసులను సబ్ కలెక్టర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో మెడికల్ క్యాంపు, శానిటేషన్, వాటర్ ట్యాంకు ద్వారా తాగునీటి సదుపాయం, వివిధ సదుపాయాలపై ఆరా తీశారు. వర్షాకాలంలో ప్రజలు కూడా నీటిని కాచి తాగేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో డయేరియా తదితర సీజనల్ వ్యాధులతో బాధపడే వారు వెంటనే సంబంధిత పిహెచ్‌సి వైద్యులను సంప్రదించాలని సూచించారు.

అతిసారపై ఇంటింటి సర్వే చేపట్టా

ప్రజాశక్తి - మంత్రాలయం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

అతిసారపై ఇంటింటి సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశించారు. బుధవారం మండలంలోని సుంకేశ్వరి గ్రామాన్ని సందర్శించిన ఆయన వైద్య సేవలపై ఆరా తీశారు. గ్రామంలో మొహర్రం పండగ ఉన్న నేపథ్యంలో పారిశుధ్య పనులపై నిఘా ఉంచాలని, రక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలని సూచించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ఇంట్లో ఎంతమంది అతిసార సోకి ఇబ్బందులు పడుతున్నారనే విషయం సమగ్రంగా నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ రాఘవేంద్ర, వైద్యాధికారి వసంత కుమారి, విఆర్‌ఒ ఆనందం, ఇతర వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఆల్ఫ్రెడ్ రాజ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ఆర్థిక సాయం అందిస్తున్న మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు

పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో సుబ్బారావు కుమారుడు వడ్డే శీను గుడిసె కాలిపోవడంతో మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం మల్లెల గ్రూప్ అధినేత, ఎఐసిసి రాష్ట్ర కార్యదర్శి మల్లెల ఆల్ఫ్రెడ్ రాజ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. సుమారు రూ.లక్షల్లో ఆర్థిక నష్టం కలిగింది. ఉండటానికి నిలువ నీడ లేకుండా పోయింది. ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మల్లెల ఆల్ఫ్రెడ్ రాజ్ తెలిపారు. మల్లెల గ్రూప్ సభ్యులు, డివైఎఫ్ఐ నాయకులు అజిత్, సతీష్, హనుమంతు, 24వ వార్డు కౌన్సిలర్ బజారి పాల్గొన్నారు.